క్లుప్తంగా

అన్నసంతర్పణకు రూ.30 వేల విరాళం


ఉత్సవ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న సురేష్ రాజ్

సబ్బవరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 85వ వార్డు పరిధి మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కాలనీలో ప్రతిష్ఠించిన శ్రీదుర్గాదేవి అమ్మవారికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ రూ.30 వేలు విరాళంగా అందించారు. ఆరిపాక సచివాలయం వద్ద ఈ మొత్తాన్ని దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ నెల 26న నిర్వహించనున్న అన్నసంతర్పణకు నగదు సాయం చేశారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ


పినగాడిలో రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

పెందుర్తి: సకాలంలో తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లను అరికట్టవచ్చని ఆర్ఏఆర్ఎస్ అనకాపల్లి శాస్త్రవేత్తలు గౌరీకుమారి, రామలక్ష్మి సూచించారు. పొలం బడి కార్యక్రమంలో భాగంగా గురువారం పెందుర్తి మండలం పినగాడి, గొరపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వర్షపాతం తక్కువ ఉన్నందున తెగుళ్ల ప్రబలే అవకాశం ఉందని, అందుకు తగిన రసాయనాలు పిచికారీ చేయాలని చెప్పారు. ఏడీఏ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పినగాడిలో నేడు రీ సర్వే

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా శుక్రవారం పినగాడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 173, 185, 186, 187, 190, 194, 201, 202లో సర్వే నిర్వహించనున్నట్లు వీఆర్వో సుబ్బారావు తెలిపారు. సంబంధిత సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు తగిన రికార్డులతో హాజరు కావాలని సూచించారు.

కోక్ ఓవెన్స్ ఉత్పత్తి పెంపునకు కృషి


కోక్‌ఓవెన్స్ నూతన విభాగాధిపతి దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: కోక్‌ఓవెన్స్ నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన దుర్గాప్రసాద్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తిలో కోక్‌ఓవెన్స్ కీలకమైందన్నారు. పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత కలిగేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ఉత్పత్తి పెంపునకు సమష్టిగా కృషి చేద్దామని కోరారు. అంతకు ముందు నాయకులు విభాగం సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్, సహాయ ప్రధాన కార్యదర్శి గోపాలరాజు, విభాగం కార్యదర్శి వై.శ్రీనివాస్, ఆకుల నూకరాజు, ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు వినతి

గాజువాక: గాజువాకలో నివాసముంటున్న తూర్పు కాపులందరికీ ఓబీసీ, బీసీ డీ సర్టిఫికెట్లను మంజూరు చేయాలని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. ఈ మేరకు ఆయన గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తూర్పు కాపులకు మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరం లేకుండా ఓబీసీ, బీసీ–డీ జారీ చేయాలని, దీనికి సంబంధించి కలెక్టర్ కూడా సర్క్యులర్ జారీ చేశారని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్ ఆధారంగా తూర్పు కాపులకు న్యాయం చేయాలని కోరారు.

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


ధర్మారాయుడుపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న వారంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మండలంలో రావాడ శివారు ధర్మారాయుడుపేట, ఇందిరమ్మ కాలనీ, కొత్త వెన్నెలపాలెం, సోమునాయుడుపాలెం, రావాడ ఎస్సీ కాలనీల్లో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామాల్లో తారసపడిన అవ్వా, తాతలు, అక్కచెల్లమ్మలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం రావాడ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో రావాడ గ్రామ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.31.34 కోట్లు అందించామని తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకుని జీవించగలుగుతున్నారంటే అందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే కారణమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కావలి రాజు, అప్పలరాజు, వాసు, జె.అశోక్‌కుమార్, పల్లా గోవిందు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, ఏఈలు గండి రామారావు, ఎం.ఎస్.ఎన్.రెడ్డి, షణ్ముఖ, వీఆర్వో భుజంగరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అమ్మలగన్నమ్మకు విశేష పూజలు


విద్యాలక్ష్మిగా అలివేలు మంగమ్మ


సుజాతనగర్ కనకదుర్గమ్మ ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు


శ్రీమహాలక్ష్మి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి ప్రాంతంలోని పలు దేవాలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మ విద్యాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. కుంకుమ పూజలు చేశారు.


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

- సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. లలిత త్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.
- చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లో కొలువైన పంచముఖ గాయిత్రి అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు జరిపారు.

నేడు దీపారాధన

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి మండలం కోట్నివానిపాలెంలో శుక్రవారం రాత్రి దుర్గమ్మ సన్నిధిలో భారీ దీపారాధన జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీమహాలక్ష్మిలా రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారు 5వ రోజు గురువారం శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తమ స్వహస్తాలతో క్షీరాభిషేకాలు చేశారు. సాయంత్రం ప్రముఖ సినీ నటి, కూచిపూడి కళాకారిని మంజు భార్గవి, కేరళకు చెందిన వీనా నాయర్, ధన్యా నాయర్ ప్రదర్శించిన మోహినీ ఘట్టం ఆకట్టుకుంది.

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉమాదేవి అమ్మవారు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమ సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

చేతివృత్తులకు అండగా ప్రభుత్వం


జగనన్న చేదోడు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, కరణం ధర్మశ్రీ


తామరంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

- 13,259 మందికి జగనన్న చేదోడు
- లబ్ధిదారులకు రూ.13.25 కోట్ల లబ్ధి

తుమ్మపాల : చేతివృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకం ఆర్థిక భరోసాను కల్పిస్తుందని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కర్నూలు జిల్లాలో జగనన్న చేదోడు నాలుగో విడత నగదు పంపిణీ పథకాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ఆయన వీక్షించారు. వివిధ కులవృత్తులకు చెందిన లబ్ధిదారులకు రూ.13 కోట్ల 25 లక్షల 90 వేలను చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13,259 మంది వివిధ కులాలకు చెందిన వృత్తిదారులను గుర్తించి వారికి ఆర్థిక సహాయంగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందిస్తున్నామన్నారు. వరుసగా నాలుగో విడత లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులావాణి, బీసీ కార్పొరేషన్ ఏఈవో రమణమ్మ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మాకవరపాలెం : చేదోడు పథకం నగదు జమ సందర్భంగా తామరం సచివాలయంలో గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు చేదోడు పథకం అమలుతో ప్రభుత్వం చేతివృత్తుల వారికి అండగా నిలుస్తుందన్నారు. వైస్ ఎంపీపీ లక్ష్మి, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, ఉప సర్పంచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జిందాల్‌ను స్టీల్‌ప్లాంట్‌లోకి అనుమతించం'


సమావేశంలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి జిందాల్‌ను అనుమతించే ప్రసక్తి లేదని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్–3ను జిందాల్‌కు అప్పగించాలని యాజమాన్యం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కార్మిక సంఘాలను, కార్మికులను చైతన్యపరిచేందుకు విభాగాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన సెంట్రల్ మిషన్ షాప్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ప్లాంట్ మొత్తం ప్రైవేటీకరణ ప్రక్రియపై ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఇలా ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కుట్ర జరుగుతోందన్నారు. బీఎఫ్–3ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే విశాఖ ఉక్కు మనుగడకు ప్రమాదం అవుతుందన్నారు. యాజమాన్యం ఈ ప్రయత్నాన్ని నిలిపివేయపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, వై.మస్తానప్ప, జె.రామకృష్ణ, జి.ప్రభాకరరెడ్డి, జి.గణపతిరెడ్డి, పరంధామయ్య, బి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో మెండుగా అవకాశాలు

అగనంపూడి: విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంచుకుంటే జీవితంలో మంచి గమ్యాన్ని చేరుకుంటారని కెరీర్ గైడెన్స్ మోటివేటర్ కౌశిక్ అగస్త్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే ఎటువంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలి, పోటీ పరీక్షలు, పరీక్షల విధానంపై వివరించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ బీటెక్ పూర్తి చేసిన తరువాత ఉద్యోగాలు పొందాలనుకునే విద్యార్థులకు పోటీ పరీక్షలకు తగిన తర్ఫీదు అవసరమన్నారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెదగంట్యాడ: గంగవరంలో బీఎస్ఎన్ఎల్ యూత్ ఆధ్వర్యంలో విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం ప్రారంభించారు. పేర్ల అప్పారావు, బడి తాతారావు, ధనరాజ్ పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

కూర్మన్నపాలెం: వడ్లపూడి ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సచివాలయం వద్ద ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ అధ్వర్యంలో వడ్లపూడి ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలపై గురువారం గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) మాధవి, గాజువాక తహసీల్దారు శ్రీవల్లి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. అవార్డులు ఉండి భూమి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. లిస్ట్‌లో పేరు లేని నిర్వాసితులు సరైన ఆధారాలతో ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కర్ణవానిపాలెం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల ఇళ్ల స్థలాలు, ఫార్మాసిటీ నిర్వాసితుల సమస్యలు, ఏపీఐఐసీ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ, చిత్రాడ రమణ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణ పుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు


జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేణపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది, నాయకులు

పరవాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత సూచించారు. ముత్యాలమ్మపాలెం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడానికి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విష జ్వరాల బారిన పడిన వారు వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని, దగ్గరలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కనక అప్పారావు మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ నీటిని సేవించకూడదన్నారు. ప్రతీ ఒక్కరూ డ్రై డేను విధిగా పాటించాలని సూచించారు. ర్యాలీలో హెల్త్ ఎగ్జిక్యూటివ్ పార్వతి, హెల్త్ సూపర్‌వైజర్లు వి.సత్యనారాయణ, ధనలక్ష్మి, ఏఎన్ఎం దుర్గ, ఎంఎల్‌హెచ్‌సీ వెంకటరత్నం, ముత్యాలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన


వైద్య శిబిరంలో కేస్ షీట్ అందిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి, తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ముందుగా శిబిరాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 608 మందిని పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 16 మందిని మెరుగైన వైద్యం కోసం సిఫార్స్ చేశారు. కంటి వైద్య శిబిరంలో 185 మందిని పరీక్షించి 90 మందికి కళ్లద్దాలు అందించారు. నలుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు సబ్బవరం పీహెచ్‌సీ డాక్టర్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, జగనన్న ఆరోగ్య సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కోటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సర్పంచ్ కర్రి నర్సింగరరావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలమణి, వైఎస్సార్ సీపీ నాయకులు బోకం రామునాయుడు, కనకరాజు, కర్రి శ్రీను, ఉప సర్పంచ్ కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆర్థిక భరోసా

అనకాపల్లిటౌన్: మహిళా రైతులు ఎన్నో పోషకాలు కలిగిన చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే చిన్న పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుని, ఆర్థిక భరోసా పొందాల్సిందిగా ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. స్థానిక సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో చెరకు, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చిరుధాన్యాలతో రూపొందించే ఆహారపదార్థాలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. వివిధ రకాలైన వ్యాధులకు చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ మహిళా రైతులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని కోరారు. జాగృతి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ ఇవ్వటంపై ఆనందం వ్యక్తం చేశారు. మహిళలు ఉత్పత్తి, ప్యాకింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మరో శాస్త్రవేత్త పి.శ్రీదేవి మాట్లాడుతూ బెల్లం చాక్లెట్లు, చెరకు రసంతో జెల్లీలు, బెల్లం బిస్కెట్లు తయారు విధానాన్ని వివరించారు.

పరిశుభ్ర క్యాంపస్‌గా ఏయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని పరిశుభ్ర క్యాంపస్‌గా తీర్చిదిద్దాలని ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు కోరారు. ఇందులో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమన్నారు. ఏయూ విద్యా విభాగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తూ గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు శుభ్రం చేశారు. ముందుగా విద్యా విభాగం తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.నాగరాజ కుమారి, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ మూర్తి పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 980వ రోజుకు రిలే దీక్షలు


980వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట శక్తికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 980వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.